బొమ్మలు.

రకరకాల బొమ్మలు. రంగు రంగుల బొమ్మలు.

కొన్ని కొండపల్లి బొమ్మలు. మరి కొన్ని మైసూరు చందనం బొమ్మలు. ఎన్నో పింగా బొమ్మలు. దక్షిణ దేశం నుండీ, రాజస్థాన్‌నుండీ ప్రత్యేకంగా తెప్పించిన రంగు రంగుల బొమ్మలు. అన్నీ కళాఖండాలు. తయారు చేసినవారి కళాకౌశలంతోపాటు, సేకరించినవారి కళాహృదయాన్ని వెల్లడిచేసే బొమ్మలు.

ఓ పెద్ద బల్లమీద దేవుడి ఊరేగింపు సెట్టు. గరుడవాహనారూఢుడై స్వామి కన్నుల పండుపు చేస్తున్నాడు. మంగళ వాద్యాలు మోగిస్తూ ముందు సన్నాయి మేళగాళ్ళూ, వేదమంత్రాలు వల్లిస్తూ వెనక నామాల స్వాములూ నడుస్తున్నారు. చుట్టూ పూజా ద్రవ్యాలు పళ్ళెరాల్లో పెట్టుకొని స్త్రీలూ, పురుషులూ, పిల్లలూ.

మరో బల్లమీద రాసలీల సెట్టు. పొన్న చెట్టు కానుకొని వేణుగానం చేస్తున్న చిన్ని కృష్ణుడు. చుట్టూ అరమోడ్పు కన్నులతో భక్తి పారవశ్యంలో శరీరాల్నే మరచి నృత్యం చేస్తున్న గోపికలు. సాక్షాత్తూ బృందావనమే భూమికి దిగివచ్చినట్లుంది. బల్లమీద మరో వైపు శకుంతలను దుష్యంత మహారాజు దగ్గరకు పంపుతున్న కణ్వమహర్షీ, శిష్యులూ, అనసూయా ప్రియంవదలు, ఎంతో ప్రేమతో పెంచిన జింకపిల్లను వొదిలి వెళ్ళటానికి కాళ్ళురాని శకుంతల కళ్ళల్లో ఆవేదన, కాళిదాసు వర్ణించిన ఘట్టానికి కమనీయమైన రూపకల్పన. ఆ శిల్పి ఎవరో నిజంగా ధన్యుడు.

మరో చిన్న బల్లమీద విశ్వామిత్ర తపోభంగమూ, శివధనుర్భంగమూ, గంగావతరణం, కామదహనం మొదలైన పురాణ ఘట్టాలను తెలియచేసే బొమ్మలు.

ఓ చిన్న అద్దాల బీరువాలో మహాత్మా గాంధీ, రామకృష్ణ వివేకానందులూ, షిర్డీ సాయిబాబా, రమణమహర్షి మొదలైన మహా పురుషుల ప్రతిరూపాలు.

ఫ్లోరా ఫౌంటెన్.

రంగు రంగుల దీపాల కాంతిలో సన్నని జలధార పడుతూంది. చాలా ఆహ్లాదకరమైన దృశ్యం. ఎంతసేపు చూసినా తనివి తీరడంలేదు.

రాజేశ్వరమ్మగారింట్లో బొమ్మల్ని రెప్పార్పకుండా చూస్తున్నారు మహిళలు. రాజేశ్వరమ్మ చిరునవ్వు నవ్వుతూ అడిగిన వాళ్ళందరికీ వివరాలు చెప్తున్నది.

"ఈ బొమ్మ ఖరీదెంతండీ ?" అంటూ అమాయకంగా అడిగింది మీనమ్మ.



"దాని ఖరీదు నూటయాభై. ఆఫీసు పని మీద మా వారు ఢిల్లీ వెళ్ళినప్పుడు తెచ్చారు బావుందా?" అంది రాజేశ్వరమ్మ నవ్వుతూ.

"చాలాబావుందండీ, అబ్బో! అంత ఖరీదే పాతికో పరకో వుండొచ్చని నే ననుకున్నాను" సమాధానం చెప్పింది తన తెలివితక్కువ తనానికి మనసులో నొచ్చుకుంటూ.

అందరూ గలగల నవ్వారు.

రాజేశ్వరమ్మ భర్త మధుసూదనరావు విశాఖపట్నం నుండి ట్రాన్సఫరై ఆ వీధిలో ఓ పెద్ద ఇల్లు అద్దెకు తీసుకొని కొత్తగా కాపురం పెట్టారు. మధుసూదనరావుగారికి రెండక్షరాల ఉద్యోగం. నాలుగంకెల జీతం. ఆ రోజు శ్రావణ శుక్రవారం. ఆవీధిలో మహిళల సందర్నీ పరిచయం చేసుకొందామని అందర్నీ పేరంటానికి పిలిచింది రాజేశ్వరమ్మ. అసలు రాజేశ్వరమ్మకు చిన్నప్పట్నించీ బొమ్మలంటే విపరీతమైన పిచ్చి. పెరిగి పెద్దయ్యాకకూడా రక రకాల బొమ్మల్ని సేకరించడం హాబీగా పెట్టుకుందామె. ఆఫీసుపనిమీద మధుసూధనరావు దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాలకూ వెళ్తుండేవాడు. తిరిగొచ్చేటప్పుడు కళాత్మకంగా కంటికి కనిపించిన బొమ్మల్ని భార్య కోసం తెచ్చేవాడు. బొమ్మలన్నింటినీ బహు జాగ్రత్తగా అమర్చి, వాటిని అలాగేచూస్తూ గంటల తరబడి కాలం గడిపేది రాజేశ్వరమ్మ.

"రాజేశ్వరమ్మగారూ! మాదో చిన్నకోరిక" అడిగింది పార్వతమ్మ.

"ఏమిటీ?"అంది రాజేశ్వరమ్మ నవ్వుతూ.

"మీ ఇంట్లో బొమ్మల్ని ఎంతసేపు చూసినా తనివి తీరడంలేదు. మరో మారొచ్చి తీరికగా చూస్తాం. ఇక వెళ్తాం"

"ఓ! అలాగే" అంటూ రాజేశ్వరమ్మ లోపలికెళ్ళి ఓ పెద్ద వెండి పళ్లెంలో పళ్ళూ, తాంబూలాలూ, జాకెట్టుగుడ్డలూపట్టుకొచ్చి, నొసట బొట్టుపెట్టి అందరికీ తాంబూలాలిచ్చింది, తాంబూలాలు పుచ్చుకొని అందరూ వెళ్ళిపోయారు.

"అదృష్టమంటె రాజేశ్వరమ్మగారిదే అదృష్టం. మొగుడికి నెలకు వెయ్యిరూపాయల జీతమట. ఇంట్లో లక్ష్మి తాండవమాడక ఏం చేస్తుంది' అంది మీనమ్మ దోవలోపార్వతమ్మ వొదినతో.

"పూజకొద్దీ పురుషుడూ, దానం కొద్దీ బిడ్డలే పిచ్చిదానా. మనకూ ఉన్నారు తుమ్మమొద్దుల్లాంటి మొగుళ్ళు. ఏం లాభం, ఖర్మకాలి ఎప్పుడైనా సినిమా కెళ్తామంటే ఖస్సుమంటారు." అంది పార్వతమ్మ మొగుళ్ల సందర్నీ జాయింటుగా కలిపి తిడుతూ.

నాలుగైదు రోజుల తర్వాత వొక సాయంత్రం పని మనిషిని వెంట బెట్టుకొని ఆ వీధి చివర కాపుర ముంటున్న కనకదుర్గ గారింటికి వెళ్ళింది రాజేశ్వరమ్మ. బాగా చీకటి పడ్డాక ఇంటికి తిరిగి వెళ్తున్నప్పుడు "రండి రండి" అంటూ రోడ్డుమీద వెళ్తున్న రాజేశ్వరమ్మను ఆహ్వానించింది మీనమ్మ. రాజేశ్వరమ్మ చిరునవ్వు నవ్వుతూ మీనమ్మ ఇంట్లో అడుగు పెట్టింది.

"కూర్చోండి" అంటూ చాప పరిచింది మీనమ్మ.

రాజేశ్వరమ్మ చాప మీద కూర్చుని ఇల్లంతా కలయ చూసింది. చాలా చిన్న ఇల్లు. ఇంట్లో ఫర్నిచరూ, తదితర సామగ్రి అంతంత మాత్రంగానే వుంది ... గోడలకు ఏవేవో పాత కాలెండర్లు వ్రేలాడుతున్నాయ్. వంటగదిలో మీనమ్మ పెద్ద కూతురు సుశీల చిన్న పిల్లలకు అన్నం పెడుతున్నది. కంచాల ముందు ఇద్దరు ముగ్గురు పిల్లలు కూర్చొని నానా హంగామా చేస్తున్నారు. ఐదారేళ్ల అబ్బాయి కంచంముందు నుంచి లేచి రెండు వేళ్లు చూపిస్తూ సుశీలతో ఏదో చెబుతున్నాడు. "ఛా! వెధవా" అంటోంది సుశీల. పన్నెండేళ్ల అబ్బాయి హరికేన్ లాంతర ముందు కూర్చుని పాఠాలు చదువుకుంటున్నాడు. మరో చిన్న పాప వచ్చీ రాని పాట పాడుతూ డాన్సు చేస్తున్నది. పిల్లలందరూ ఆరోగ్యంగా, బొద్దుగా, ముద్దుగా, రబ్బరు బొమ్మల్లా ఉన్నారు.

"చస్తున్నానండీ ఈ పిల్లలతో వేగలేక. వెధవ కొట్లాటలూ వీళ్ళూనూ" అంది మీనమ్మ రాజేశ్వరమ్మకు కాఫీ అందిస్తూ.

రాజేశ్వరమ్మ కాఫీ చప్పరిస్తూ నవ్వింది.

"మీ ఇంట్లో బొమ్మలన్నీ చాలా బాగున్నాయండీ! బొమ్మల్ని చూపమని మా పిల్లలు నా ప్రాణాలు తోడేస్తున్నారు" అంది మీనమ్మ. కాఫీ కప్పు కింద పెట్టి పిల్లల వైపు మరోసారి చూసింది రాజేశ్వరమ్మ. అప్రయత్నంగా ఆమె కళ్లు చెమర్చినై. నిజమే. తన ఇంట్లో బొమ్మలన్నీ చాలాఖరీదైనవే. అపురూపమైనవే. కానీ వాటిల్లో ప్రాణంలేదు, అవన్నీ నిర్జీవ ప్రతిమలు. మీనమ్మ ఇంట్లో బొమ్మలు అమూల్యమైనవి. పైగా జీవకళ ఉట్టిపడుతూ చైతన్యంతో కళకళ లాడుతున్న బొమ్మలు. తనకు సంతానం లేదు. గంపెడు బిడ్డలతో కాపురం చేస్తున్న మీనమ్మ నిజంగా ఎంత అదృష్టవంతురాలు!

"అలాగే! పిల్లలనందరినీ వెంటబెట్టుకొని రేపు తప్పకుండా రండి. కానీ మాదో చిన్న కోరిక. మా ఇంట్లో బొమ్మల్ని నేను చూపిస్తాను. అలాగే మీ ఇంట్లో బొమ్మల్ని కనీసం వారానికి రెండుసార్లు మీరు నాకు చూపించాలి. లేదా నేనే స్వయంగా మీ ఇంటి కొచ్చి చూస్తాను." అంది రాజేశ్వరమ్మ లేస్తూ.

బుర్ర గోక్కుంటూ అలాగే నిలబడి పోయింది మీనమ్మ రాజేశ్వరమ్మ మాటల కర్థాలు వెతుకుతూ.

బాబోయ్

—డా॥ సి. నారాయణరెడ్డి

"రంకెలు
రణ గొణ ధ్వనులు
రక్కసి ముళ్ళు
రక్తపాతాలు
పడదెబ్బలు
పెడబొబ్బలు
ధూమం ధూళి
తుక్కూ దూగర
భరించలేను భరించలేను
బాబోయ్ వెళ్లిపోతాను."
సగటుజీవి వెళ్లిపోయింది
సమాధి లోనికి.

"నిట్టూర్పులు
నిశ్శబ్దాలు
మంచు గడ్డలు
చీకటి గద్దలు
కీళ్ల వంకర్లు
కాళ్ల కొంకర్లు
మాంద్యం మైకం
మట్టీ జిడ్డూ
భరించలేను భరించలేను
బాబోయ్ బయటి కొస్తాను."
సగటుజీవి వచ్చేసింది
సమాధిలోనుంచి.